క్లుప్తంగా...

ఉప్పల్ తహసీల్దార్‌గా వెంకట నర్సింహరెడ్డి



ఉప్పల్: ఉప్పల్ తహసీల్దార్‌గా వెంకట నర్సింహ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. శామీర్‌పేట డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న ఆయన పదోన్నతిపై ఉప్పల్‌కు వచ్చారు. ఉప్పల్ తహసీల్దార్‌గా వచ్చిన రామకృష్ణ రెడ్డికి రెండు రోజుల్లోనే పదోన్నతిపై వెళ్లారు.

మహిళలకు ఓపెన్ జిమ్



సీతారామ కాలనీలో జిమ్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత తదితరులు

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ పరిధిలోని సీతారామకాలనీలో మహిళలకు ప్రత్యేకంగా ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళ ఆరోగ్యంగా ఉంటేనే దేశం ఆరోగ్యంగా ఉంటుందని, అందువల్ల ప్రతి ఒక్కరికీ వ్యాయామం అవసరం అన్నారు. నాయకులు బన్నాల ప్రవీణ్, కొండల్‌రెడ్డి, జగన్ రమేష్, రామాంజనేయులు, బింగి శ్రీనివాస్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు హెల్త్ కార్డులు అందజేసిన సన్‌సీడ్



జర్నలిస్టులకు హెల్త్‌కార్డులు అందజేస్తున్న సన్‌సీడ్ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ అన్వేష్ తదితరులు

కుషాయిగూడ: కుషాయిగూడలోని సన్‌సీడ్ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి యజమాన్యం కాప్రా సర్కిల్ పరిధిలో పనిచేసే జర్నలిస్టుల కటుంబాలకు యాభై శాతం రాయితీపై వైద్యం అందించేందుకు ముందుకు వచ్చింది. ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ అన్వేష్, ఎండీ డాక్టర్ తేజస్విని చేతులమీదుగా జర్నలిస్టులకు యాభై శాతం రాయితీకి సంబంధించి హెల్త్ కార్డులను అందజేశారు. సన్‌సీడ్ ఆస్పత్రి యజమాన్యానికి క్లబ్ అధ్యక్షుడు శనిగరం అశోక్, ప్రధాన కార్యదర్శి గడ్డమీది బాలరాజుగౌడ్, కోశాధికారి లక్కిడి బాల్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భాను ప్రకాష్, డాక్టర్ లావణ్య, డాక్టర్ వైష్ణవి, సీనియర్ పాత్రికేయులు వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు కేటాయించేందుకు కృషి



దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

మల్కాజిగిరి: అర్హులందరికీ ఇళ్లు కేటాయించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. గురువారం బీజేఆర్‌నగర్‌లో డబుల్‌బెడ్ రూమ్ దరఖాస్తుల పరిశీలన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లు లేని పేద, మధ్యతరగతి ప్రజలకు ఇళ్లు ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం డబుల్‌బెడ్‌రూమ్, గృహలక్ష్మి పథకాలను తీసుకు వచ్చిందన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రమేష్, బిల్ కలెక్టర్ విజయనిర్మల, బాబు, సంపత్ రావు, కిషోర్, వాజిత్ తదితరులు పాల్గొన్నారు.

మౌలాలికి బస్సు సౌకర్యం



మౌలాలి: ఓ దశాబ్ద కాలం తర్వాత మౌలాలికి ఆర్టీసీ బస్సు రాకపోకలు జరగడంతో మౌలాలి వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మౌలాలి కమాన్ మీదుగా దశాబ్ద కాలంగా బస్సు రాకపోవడంతో మౌలాలి చుట్టుపక్కల కాలనీవాసులు ఎన్నో ఇబ్బందులకు గురయ్యారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కృషితో బుధవారం మౌలాలి నుంచి బస్సు సౌకర్యం ప్రారంభమైంది. ఈ సందర్భంగా స్థానికులు బస్సు డ్రైవర్, కండక్టర్‌ను సత్కరించి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు అమీనుద్దీన్, సత్తయ్య, భాగ్యనంద్, నర్సింగ్‌రావు, సాధిక్, ఇబ్రహిం, సంతోష్‌గుప్తా, దినేష్, మణికంఠ, షకీల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ నుంచి నేనే పోటీలో ఉంటా

ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి



ఏఎస్‌రావునగర్‌లో పాదయాత్ర చేస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

కుషాయిగూడ/కాప్రా: ఏ మాత్రం సందేహం అక్కర్లేదు.. ఉప్పల్ నుంచి తిరిగి నేనే పోటీలో ఉంటానని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా చేపట్టిన మీ కోసం.. మీ ఎమ్మెల్యే పాదయాత్ర బుధవారం 27వ రోజు డాక్టర్ ఏఎస్‌రావునగర్ డివిజన్‌లో కొనసాగింది. డివిజన్ పరిధిలోని కమలానగర్, మహేశ్‌నగర్, పంచవటికాలనీ, శ్రీనివాసనగర్, అరుల్‌కాలనీ, ఏఎస్‌రావునగర్, అణుపురం కాలనీల్లో ఇంటింటికీ తిరుగుతూ పాదయాత్ర చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనుల నిర్వహణ, స్థానిక సమస్యలను తెలుసుకుంటూ పాదయాత్ర ముందుకు సాగింది. మూడు రోజుల పాటుగా సాగిన పాదయాత్రలో గుర్తించిన సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వర పరిష్కారం చూపాలని ఆదేశించారు. అనంతరం అణుపురం కమ్యూనిటీ హాల్‌లో విలేకరులతో మాట్లాడుతూ తిరిగి ఉప్పల్ నుంచి తానే బరిలో ఉండబోయేదని, అందులో సందేహం లేదన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రతిపక్షాలకు పిచ్చెక్కిపోతోందన్నారు. దిక్కుతోచని స్థితిలో రెండు లక్షల రుణమాఫీ, రూ.4 వేల పింఛన్లు వంటి హామీలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారన్నారు. కానీ ఆ పథకాలన్నీ ఇప్పటికే రాష్ట్రంలో అమలవుతున్న వాస్తవాలను ప్రతిపక్షాలు గ్రహించాలన్నారు. ఉప్పల్‌లో కారిడార్ నిర్మాణం చేయకుండా చేతులెత్తేసిన పార్టీ నాయకులే పనులు నిలిచిపోయాయంటూ ధర్నాలు చేయడం సిగ్గు చేటన్నారు. జమ్మిగడ్డ శ్మశానవాటికకు సంబంధించి స్థల యజమానులతో మాట్లాడమని త్వరలోనే ఆ సమస్య కొలిక్కి వస్తుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్లు పజ్జూరి పావనీరెడ్డి, సింగిరెడ్డి ధన్‌పాల్‌రెడ్డి, గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, పార్టీ డివిజన్ అధ్యక్షుడు కాసం మహిపాల్‌రెడ్డి, పెద్దాపురం కుమారస్వామి, సుడుగు మహేందర్‌రెడ్డి, దప్పు గిరిబాబు, బోదాసు రవి, మురళిపంతులు, సీతారాంరెడ్డి, మల్కా రమాదేవి, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూనే ఉంటా..



టీచర్లకు జీతాలు అందజేస్తున్న బీఆర్ఎస్ సీనియర్ నేత బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: పేదరికం కారణంగా విద్యార్థులు చదువుకు దూరం కావొద్దని బీఆర్ఎస్ సీనియర్ నేత, బీఎల్ఆర్ ట్రస్టు చైర్మన్ బండారి లక్ష్మారెడ్డి అన్నారు. చర్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో సరైన సిబ్బంది లేక విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను బీఎల్ఆర్ దృష్టికి తీసుకెళ్లగా పాఠశాలలో ఇద్దరు ప్రైవేటు టీచర్లను ఏర్పాటు చేసి 5 సంవత్సరాలుగా జీతాలు చెల్లిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం టీచర్లకు జీతాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీచర్ల కొరత తన దృష్టికి రావడంతో ట్రస్టు ఆధ్వర్యంలో టీచర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంతేగాకుండా ఉప్పల్ నియోజకవర్గంలో ఉన్నత చదువులకు దూరమవుతున్న వారికి, విదేశాలకు వెళ్లే వారికి, అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న వారికి ఆర్థిక సహకారాలు అందజేస్తూ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల హెచ్ఎం శోభారాణి, స్థానిక నేతలు జౌండ్ల ప్రభాకర్‌రెడ్డి, బొడిగె రాజుగౌడ్, మహేష్‌గౌడ్, ఎంకిర్యాల నరసింహ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పరిశీలన

మల్కాజిగిరి: డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లో రూ.20 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ యూజీడీ, మంచినీటి పైపులైన్లు పూర్తయిన తర్వాత సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో సంతోష్, వినోద్, మురళిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

వాజ్‌పేయి విగ్రహానికి నివాళి



అల్వాల్: వినాయక్‌నగర్ డివిజన్ పరిధిలోని వాజ్‌పేయి నగర్‌లో బుధవారం జరిగిన మాజీ ప్రధాని అటల్ బీహారి వాజ్‌పేయి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన ఆయన విగ్రహాన్ని బీజేపీ శ్రేణులు ఆవిష్కరించారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటారు. కార్యక్రమంలో మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత ఆకుల రాజేందర్, కార్పొరేటర్ రాజ్యలక్ష్మీ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బాలలింగం, నాయకులు ప్రియతం రామకృష్ణ, లక్ష్మణ్‌గౌడ్, గాలికర్ ఆనంద్, డిఎల్ వెంకటేష్, నర్సింహగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



వేడుకల్లో కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి

బోడుప్పల్: విద్యార్థి దశ నుంచే విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్ లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్‌లో బుధవారం జరిగిన ఇన్వెర్సరీ సెర్మనీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రాబోయే తరానికి కాబోయే నాయకులుగా ఇక్కడి నుంచే తయారు కావాలని సూచించారు. చదువుతోపాటు చక్కని ఆలోచనలతో విద్యార్థులు ముందుకెళ్లాలన్నారు. ప్రతి విద్యార్థి నాయకుడిగా ఎదిగేందుకు కృషి చేయాలన్నారు. అందుకు కావాల్సిన ప్రణాళికలు చిన్ననాటి నుంచే రూపొందించుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులకు పదవి హోదాలను ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఇంజినీర్ అదృశ్యం



శుభో దయరావు(ఫైల్)

అల్వాల్: రిటైర్డ్ ఇంజినీర్ అదృశ్యమైన ఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటాపురంలో నివసించే శుభోదయరావు(76) ఆర్అండ్‌బీ విభాగంలో ఇంజినీర్‌గా పనిచేసి రిటైర్డ్ అయ్యారు. ఈ నెల 15 తేదీన బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు అల్వాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఉప్పల్: బ్యాంక్ కాలనీ 11 కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా గురువారం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు బ్యాంక్ కాలనీ, బీరప్పగడ్డ, ప్రశాంత్‌నగర్, జహీద్ నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ కిరణ్ తెలిపారు. కళ్యాణపురి 11 కేవీ మరమ్మతుల కారణంగా గురువారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈస్ట్ కళ్యాణపురి, బ్యాంక్ కాలనీ, రాఘవేంద్రానగర్, టీచర్స్ కాలని, సీతారామ కాలనీ, బాలాజీ ఎన్‌క్లేవ్ ప్రాంతాల్లో కరెంటు ఉండదని తెలిపారు.

బోడుప్పల్: పలు కాలనీల్లో గురువారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ మైలారం స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ సాయినగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరస్వతినగర్, ఉదయ్‌నగర్, శ్రీలక్ష్మి నగర్, విజయపురి కాలనీ, రామిరెడ్డి నగర్, అశోక్‌నగర్, ప్రశాంత్‌నగర్‌లో.. అలాగే 11కేవీ బృందావన్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు లక్ష్మినగర్, రాఘవేంద్ర కాలనీ, సాయి మారుతీనగర్‌లో కరెంటు ఉండదన్నారు.

రామంతాపూర్: చర్చి కాలనీ విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నెహ్రూనగర్, ఇందిరానగర్, ప్రగతినగర్, సత్యనారాయణ స్వామి టెంపుల్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, శ్రీనివాసపురం ఫీడర్ మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వెస్ట్, ఈస్ట్ శ్రీనివాసపురం, యాదయ్య హోటల్, కామాక్షిపురం, వెంకట్‌రెడ్డినగర్, నవరంగ్‌గూడ, వాసవినగర్ తదితర ప్రాంతాల్లో కరెంటు ఉండదు.

మల్కాజిగిరి: వినాయకనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గంగపుత్ర సంఘం, వినాయకనగర్ బ్లాక్-3, సంతోషిమానగర్, సింహాద్రినగర్, గ్యాస్ గోడౌన్ ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు. ఆనంద్‌బాగ్ సబ్‌స్టేషన్ 11 కేవీ చంద్రగిరి కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి 5.30 వరకు లాల్‌వాణీనగర్, సాయిబాబా దేవాలయం, జైన్ మందిర్, శివగౌరి ఎన్‌క్లేవ్ ప్రాంతాల్లో కరెంటు ఉండదన్నారు.

మల్లాపూర్: సూర్యనగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో గురువారం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు సూర్యనగర్, బ్యాంక్ కాలనీ, లక్ష్మీగణపతి దేవాలయం రోడ్, మల్లికార్జున్‌నగర్, శక్తి సాయి నగర్ ప్రాంతాల్లో కరెంటు ఉండదు.

గద్దర్ మరణం తీరని లోటు



గద్దర్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ప్రొ.కోదండరామ్

అల్వాల్: ప్రజాగాయకుడు గద్దర్ మరణం రాష్ట్ర ప్రజలకు తీరని లోటని తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. బుధవారం వెంకటాపురంలోని భూదేవినగర్‌లో ఉన్న గద్దర్ నివాసానికి కోదండరామ్ వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మహాబోధి విద్యాలయంలోని గద్దర్ సమాధి వద్దకు వెళ్లి నివాళులర్పించారు. టీజేఎస్ రాష్ట్ర కార్యదర్శి బైరి రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, దయాకర్, రెడ్డిపల్లి శ్రీనివాస్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

ట్యూన్ ఆఫ్ అకాడమీ వార్షికోత్సవం



మల్కాజిగిరి: ట్యూన్ ఆఫ్ అకాడమీ ఆఫ్ మ్యూజిక్ 20వ వార్షికోత్సవం ఈస్ట్ ఆనంద్‌బాగ్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అకాడమీ విద్యార్థుల సంగీత కచేరి ఆకట్టుకుంది. అకాడమీ ఫౌండర్ సుధీర్ మాట్లాడుతూ 20 ఏళ్లలో వేల మంది విద్యార్థులు సంగీతాన్ని నేర్చుకున్నారని, సంగీతంతో మానసిక స్థితి మెరుగుపడుతుందన్నారు.

అభినందనలు



అల్వాల్: అల్వాల్‌కు చెందిన సికింద్రాబాద్ రెడ్డి జేఏసీ అధ్యక్షుడు తోట దశ్మంత్‌రెడ్డి బుధవారం అల్వాల్ సీఐ ఉపేందర్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

అత్తింటి వేధింపులకు గృహిణి ఆత్మహత్య

అల్వాల్: అత్తింటి వేధింపులు భరించలేక గృహిణి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. వినాయక్‌నగర్‌లో నివాసముండే చింతల గణేష్‌కు రెండు సంవత్సరాల క్రితం స్వర్ణలతతో వివాహం జరిగింది. కొద్ది రోజులుగా అదనపు కట్నం కోసం స్వర్ణలతను అత్త, ఆడపడుచూ, భర్త వేధిస్తున్నారు. వివాహం అనంతరం సైతం అదనంగా రూ.5 లక్షల కట్నం ఇచ్చామని, అయినా వేధింపులు తగ్గలేదని, దీంతో స్వర్ణలత ఇంట్లో చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిందని మృతిరాలి తల్లి బాలమణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భవనం పైనుంచి పడి కార్మికుడి మృతి

అల్వాల్: నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి పడి కార్మికుడు మృతి చెందిన ఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకులం ప్రాంతానికి చెందిన ఆదినారాయణ(48) బతుకుదెరువు నిమిత్తం నగరానికి వచ్చి భవన కార్మికుడిగా పనిచేస్తూ అల్వాల్‌లో నివాసం ఉంటున్నాడు. అల్వాల్ హిల్స్‌లోని బుధవారం ఓ ప్రైవేటు పాఠశాలపై జరుగుతున్న అదనపు అంతస్తు నిర్మాణం పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడ్డారు. తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ విషయం ఆరా తీయగా తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యం



అల్వాల్: ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని బీజేవైఎం జాతీయ కోశాధికారి పీఎం సాయిప్రసాద్ అన్నారు. ఇటీవల జరిగిన స్నూకర్స్ టోర్నమెంట్‌లో విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడికి ప్రాథమికస్థాయిలో అందిన ప్రోత్సాహంతోనే ఉన్నత స్థాయికి వెళ్తున్నారన్నారు. కార్యక్రమంలో సురేష్, అభిజిత్, పన్నాల హరీస్‌రెడ్డి, సదానంద్‌గౌడ్, మాణిక్‌రెడ్డి, ఆంథోని, ప్రతిభారావు, ప్రశాంత్‌రెడ్డి, అజిత్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



రామంతాపూర్: గణేష్‌నగర్‌లోని కాకతీయ హైస్కూల్‌లో బుధవారం విద్యార్థులు రూపొందించిన పలు నమూనాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. చంద్రయాన్-3 అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ వై.భవానీ మాట్లాడుతూ ఇటువంటి ప్రదర్శనలు విద్యార్థుల్లోని సృజనాత్మక శక్తిని వెలికితీస్తాయన్నారు.

వాణీనగర్ నూతన కార్యవర్గం

గౌతంనగర్: వాణీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడు జి.సిద్దయ్య, ప్రధాన కార్యదర్శిగా నర్సింగ్‌రావు, ఉపాధ్యక్షులుగా ఈ.బలరామ్, పి.మల్లయ్య, కోశాధికారి రఘునందన్, ఆర్గనైజింగ్ సెక్రెటరిగా చందు, లక్ష్మణ్‌రావు, కుమార్, సత్యప్రసాద్, శ్రీనివాస్, గణేషన్ ప్రకాష్, లీలా నియమితులయ్యారు.



అర్హులైన పేదలకు డబుల్ ఇళ్లు కేటాయించాలి



ఉప్పల్ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నేతలు

ఉప్పల్: అర్హులైన నిరుపేదలకు రెండు పడకల ఇళ్లను అందించాలని, సర్వే పారదర్శకంగా నిర్వహించి లబ్ధిదారులకే కేటాయించాలని కోరుతూ బుధవారం సీపీఐ మేడ్చల్ జిల్లా ఆధ్వర్యంలో నేతలు ఉప్పల్ తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి జీ.దామోదర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఇవ్వాలని నిర్ణయించిందని, కానీ ఉప్పల్ మండలంలో సర్వే పారదర్శకంగా జరగడం లేదని, దీని వల్ల అర్హులైన వారు అవకాశాన్ని కోల్పోతారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పార్టీ నేతలు అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో మండల కార్యదర్శి పి.రామ్ నారాయణ, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్, స్వామిదాస్, కృపాకర్, భిక్షపతి, నర్సింగరావు, కుమార్ తదితరులు ఉన్నారు.

చైతన్యనగర్ డబుల్ ఇళ్ల ఎదుట బీజేపీ ఆందోళన



చైతన్యనగర్ డబుల్ ఇళ్ల ఎదుట ఆందోళన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, బీజేపీ నేతలు

కుషాయిగూడ: అర్హులైన పేదలకే డబుల్ ఇళ్లను కేటాయించాలని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ డిమాండ్ చేశారు. డబుల్ ఇళ్ల పంపిణీలో ప్రభుత్వ అలసత్వాన్ని నిరసిస్తూ బుధవారం హెచ్‌బీకాలనీ, చైతన్యనగర్‌లోని డబుల్ ఇళ్ల ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. డబుల్ ఇళ్ల పేరుతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పదవి కాలం పూర్తికావొస్తున్నా ఇళ్లను పంపిణీ చేయకుండా మభ్యపెడుతోందన్నారు. ఎన్నికలు సమీస్తున్న వేళ మరో మారు పేదలను మోసం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బ్రహ్మచారి, ఎనుముల మహేష్‌కుమార్, రాంప్రదీప్, డీఎల్. ప్రసాద్, గోపాల్‌రెడ్డి, అపర్ణ, ఉమారాణి, శశికళ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి



శ్రీసాయినగర్ ఈస్ట్ కాలనీలో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నాని పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 2వ డివిజన్ శ్రీసాయినగర్ ఈస్ట్ కాలనీలో సుమారు రూ.8 లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్ సుభాష్ నాయక్, కమిషనర్ ఇస్లావత్ నమ్మతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో డీఈ శ్రీనివాస్, ఏఈ భిక్షపతి, వర్క్‌ఇన్‌స్పెక్టర్ ప్రదీప్, అధ్యక్షుడు పగడాల బాల్‌రాజ్, సురేందర్‌రెడ్డి, రామోజీశంకరా చారి, ఉపేందర్, కిరణ్ నాయక్, ప్రకాష్‌గుప్తా, శ్రీసాయినగర్ వాసులు తదితరులు పాల్గొన్నారు.

జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో భవిష్య స్కూల్ విద్యార్థులు



విద్యార్థులకు సర్టిఫికెట్స్‌ను అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

ఉప్పల్: చిలుకానగర్‌లోని భవిష్య స్కూల్ విద్యార్థులు జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించారు. 3 నుంచి 6 ఏళ్ల వయస్సులోపు చిన్నారులు 77వ స్వాతంత్య్ర దినోత్సవాలను పురస్కరించుకుని 77 మంది స్వాతంత్య్ర సమరయోధులను గుర్తించి వారి పేర్లను చెప్పారు. వీటితో పాటు నేషనల్ సింబల్స్, తెలంగాణ సమరయోధులు, రాష్ట్ర సింబల్స్, దేశ సైంటిస్టుల పేర్లను వారి వివరాలను 10 మంది చిన్నారులు కేవలం రెండు నిమిషాల్లో చెప్పి రికార్డు సాధించారు. చిన్నారుల ప్రతిభను గుర్తించిన జీనియస్ బుక్ ఆఫ్ రికార్డు సంస్థ ప్రతినిధులు విద్యార్థుల ప్రతిభకు అభినందనలు తెలిపారు. అనంతరం చిన్నారులకు సర్టిఫికెట్లను అందజేశారు. ముఖ్య అతిథిగా ఉప్పల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గోవింద్ రెడ్డి, కార్పొరేటర్ మహేశ్వరి కృపాసాగర్ హాజరయ్యారు. స్కూల్ కరస్పాండెంట్ సమత, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



కుషాయిగూడ: చిన్ననాటి నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని లైఫ్ స్కిల్స్ ట్రైనర్ సందీప్ రాజ్‌వర్మ అన్నారు. ఈసీఐఎల్‌లోని నారాయణ పాఠశాలలో బుధవారం జరిగిన క్యాబినెట్ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హెడ్ బాయ్, హెడ్ గర్ల్‌తో పాటుగా పలువురికి బ్యాడ్జీలను ప్రదానం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించినప్పుడే లక్ష్యాలను సులువుగా చేరుకోవచ్చన్నారు. ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మంజు బార్గవి, ఏజీఎం పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.